# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, గురువారం 10 ఏప్రిల్ 2025 | VIKARABAD


## స్పెషల్ డ్రైవ్



సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఎర్లీబర్డ్ పథకం ద్వారా రూ.1000 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యాన్ని ఖరారు చేసిన కమిషనర్ ఇలంబర్తి..టార్గెట్ చేధించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభిస్తుంది. ఈ ఎర్లీబర్డ్ స్కీం ఆఫర్‌ను ఇళ్లు, వ్యాపార సముదాయాల యాజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటికే అధికారులు సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఈ 5 శాతం రిబేట్ ఉంటుందని ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగానే బుధవారం వరకు 2.4 లక్షల మంది ఎర్లీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోగా...తద్వారా రూ. 147 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. ఈ నెలాఖరు నాటికల్లా లక్ష్యాన్ని చేరాలని ఆ దిశగా డీసీలు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. అంతేకాకుండా ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎస్ఎంఎస్‌లు చేర్చడం, విస్తృత అవగాహన కల్పించనున్నారు.




రైతు సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం అన్నారు. రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మధారెడ్డి అధ్యక్షతన బుధవారం రైతులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీఆర్వో సంగీతకు రైతు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. - ఆదిబట్ల, ఏప్రిల్ 9

# ఎండిపోతున్న పంటలు.. అన్నదాత దిగాలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు.. చుక్క నీటినీ పోయని బోర్లు
- గత పది రోజుల్లో జిల్లావ్యాప్తంగా వేలాది ఎకరాల్లో ఎండుముఖం
- మరో 20 రోజుల్లో చేతికందాల్సిన వరి పంట రాక దిక్కుతోచని స్థితిలో రైతులు
- రైతు భరోసా వస్తుందన్న ఆశతో సాగు
- ఆరుగాలం శ్రమించినా రైతులకు అప్పులే దిక్కు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్న కర్షకులు

**రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది.. రైతులు కన్నీరు పెడితే రాజ్యానికి చేటువచ్చినట్లే.. రైతును రాజుగా చూసినప్పడే రాజ్యం బాగుపడుతుందని ఎనుకటికి పెద్దలు చెప్పేవారు. కాని నేటి కాంగ్రెస్ సర్కారు రైతుల గురించి పట్టించుకోవడంలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చేతికందే సమయంలో నీరు సరిపోక వేలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఆరుగాలం శ్రమించినా అప్పులే దిక్కయ్యే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసినా ఎండిన పంటలే దర్శనమిస్తున్నాయి. గత పదిహేను రోజుల్లో సుమారు వంద ఫీట్ల వరకు భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో పది రోజుల క్రితం వరకు కూడా పోసిన బోర్లు కూడా ఎండిపోగా.. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. చాలా మంది రైతులకు రైతు భరోసా రాక, రుణమాఫీ కాక పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సాయం అందించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.**



మాడ్గుల మండలంలో ఎండిన వరిపంట

రంగారెడ్డి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : యాసంగిలో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సుమారు 90 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందనే నమ్మకంతో ఎక్కువ మంది అన్నదాతలు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. మరో 20 రోజుల్లో పంటలు చేతికందుతాయనే దశలో కండ్ల ముందే పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాలతో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు వంటి మండలాల్లో పంటలు చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంట పొలాలకు అందిస్తున్నారు. కొన్ని చోట్ల అప్పులు చేసి మరీ అదనపు బోర్లు వేస్తున్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది.

### వేలాది ఎకరాల్లో ఎండిన పొలాలు

రంగారెడ్డిజిల్లాలో పది నుంచి పదిహేను వేల ఎకరాల వరకు వరి పంట ఎండిపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. ముఖ్యంగా మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కేశంపేట, కొందుర్గు, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్ వంటి మండలాల్లో పంటలు పెద్దఎత్తున ఎండిపోతున్నాయి. పంటలు చేతికందే సమయానికి దీని తీవ్రత మరింత ఉంటుందని రైతులు వాపోతున్నారు.

### చేతికందే సమయంలో ఎండిపోతున్న పంటలు



మరో పది రోజుల్లో పంటలు చేతికందుతాయనుకున్న సమయంలో ఉన్న బోర్లు పూర్తిగా ఎండిపోవటంతో పంట పొలాలు ఎండుముఖం పట్టాయి. దీంతో మేము పెట్టిన పెట్టుబడులు, చేసిన కష్టం పూర్తిగా నేలపాలైంది. చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించడంలేదు.

**- పర్వతాలు యాదవ్, మాడ్గుల మండలం**

### అప్పులు మీద పడుతున్నాయి



చేసిన కష్టం నేలపాలైంది. అప్పులు తీరే మార్గం లేకుండా పోయింది. అప్పులెలా కట్టాలో తెలియక అవస్థలు పడుతున్నాం. అప్పులిచ్చినవారు ఆగే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకుని రైతులను కాపాడాలి.

**- రాములు, నల్లచెరువు, మాడ్గుల మండలం**

కులకచర్ల : చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ఎండిన పంటలతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన పంటలు బోర్లలో నీరు ఎండిపోవడంతో వరి పంట చేతికి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 1850 ఎకరాల్లో వరి పంట సాగుచేసినట్లు చౌడాపూర్ మండల వ్యవసాయాధికారి పరిమళ తెలిపారు. బోర్లలో నీటి శాతం తగ్గడం వలన అక్కడక్కడ వేసిన వరి పంట పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. లింగంపల్లి రెవెన్యూపరిధిలో 196 మంది రైతులు వరి పంట వేసినట్లు తమ దగ్గర నమోదు చేసుకున్నారని ఏఈవో విశ్వనాథం తెలిపారు.



లింగంపల్లిలో ఎండిన వరి పంట

### పంటను కాపాడలేక పోతున్నా..



నేను వేసిన పంటను కాపాడుకునేందుకు చాలా కష్టపడ్డాను. తీరా బోర్లలో నీటి శాతం తగ్గి పూర్తి స్థాయిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. నేను రెండు ఎకరాల్లో పంట సాగు చేశాను. అందులో ఎకరం పొలం ఎండిపోయింది. నీళ్లు చాలక వేసిన పంటను కాపాడలేకపోతున్నాను. గతంలో ఎప్పుడూ ఇలాంటి సమస్యను ఎదుర్కొనలేదు. ఇలాంటి పరిస్థితి వస్తుందని వ్యవసాయ అధికారులు కూడా తెలుపలేదు. అప్పులు చేసి పంటను సాగుచేశాను. పంట ఎండిపోగా పశువులకు మేపే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**- మ్యాకల లక్ష్మయ్య, రైతు, లింగంపల్లి, చౌడాపూర్ మండలం**



పరిగి : పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన ఎల్లమ్మ కుటుంబం బోరు కింద ఎకరంన్నర విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారు. పంట సాగు కోసం సుమారు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. విత్తనాలు మొదలుకొని ఎరువులు, కరిగెట, నాట్లు వేయడం వరకు డబ్బులు ఖర్చు చేసి పంట సాగు చేపట్టారు. అంతా బాగుందనుకున్న తరుణంలో బోరులో నీరు తగ్గిపోయింది. మరో పక్షం రోజుల్లో పంట చేతికి అందుతుందని ఆశించగా.. బోరులో నీరు తగ్గడంతో రైతు కుటుంబం ఆందోళనకు గురైంది. దీంతో సాగు చేసిన ఎకరంన్నర వరి పంటలో సగం పూర్తిగా ఎండిపోయింది. సగం పంటకే నీరు అందుతున్నది. పంట కోసం పెట్టిన పెట్టుబడి రాదని, ప్రభుత్వం తమను ఆదుకొని సహాయపడాలని కోరుతున్నారు.

### పంట ఎండిపోయింది



నేను బోరు కింద పంట వేయడానికి అడవి వెంకటాపూర్ గ్రామానికి చెందిన గోవిందమ్మ వద్ద రెండు ఎకరాల పొలాన్ని 15 వేలకు కౌలుకు తీసుకున్నాను. కౌలుకు తీసుకున్న సమయంలో బోరులో నీరు పుష్కలంగా ఉన్నది. కాని ప్రస్తుతం నీటి శాతం పూర్తిగా తగ్గింది. దీంతో రెండు ఎకరాల్లో ఎకరంన్నర పొలం ఎండిపోయింది. కౌలు డబ్బులు ఎలా కట్టాలో అర్థం కావడంలేదు. డబ్బులు కట్టడానికి పుణే, ముంబయికి వలస వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**- బైరం శ్రీనివాస్, రైతు, లింగంపల్లి**



### అప్పు ఎలా తీర్చాలో..

నాకున్న రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. ఈసారి వర్షాలు బాగానే పడ్డాయని, బోర్లలో నీళ్లు కూడా బాగానే ఉన్నాయని భావించి బోరు కింద ఉన్న రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. వేసిన నాటి నుంచి నేటి వరకు పంటను కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు కష్టపడ్డాను. కాని వరి చేను ఎన్నులు విరిచే సమయంలోనే బోర్లలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయి పొలానికి నీటిని అందించలేని స్థితి వచ్చింది. ఇప్పటికే ఎకరం మేరకు పంట ఎండిపోయింది. పంట వేయడానికి అప్పు తీసుకువచ్చాను. ఎలా తీర్చాలో తోచడంలేదు.

**- మ్యాకల నర్సయ్య, రైతు, లింగంపల్లి, చౌడాపూర్ మండలం**



ముజ్రా పార్టీలో పాల్గొన్న యవతీయువకులు

# బర్త్‌డే ముసుగులో ముజ్రా..

- మద్యం, గంజాయి మత్తులో అశ్లీల నృత్యాలు
- పార్టీలో ఏడుగురు యువతులు.. 13 మంది యువకులు
- పశ్చిమబెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందినవారు
- దాడి చేసిన ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు
- 70 గ్రాముల గంజాయి, రూ.19 వేలు, ఆరు వాహనాలు స్వాధీనం



ముజ్రా పార్టీ నిర్వహించిన ఫామ్ హౌస్ ఇదే..

మొయినాబాద్, ఏప్రిల్ 9 : హైదరాబాద్ నగరంలోని బోరబండ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ లుఖ్మార్ తన బర్త్‌డే వేడుకలను నగర శివారులోని మొయినాబాద్ మండల పరిధి ఎతుబార్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని హాలిడే హోమ్ హౌస్‌లో మంగళవారం రాత్రి జరుపుకొన్నారు. బర్త్‌డే పార్టీ ముసుగులో ముజ్రా పార్టీని కూడా ఏర్పాటు చేశారు. ఈ పార్టీలో పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందిన ఏడుగురు యువతులు, 13 మంది యువకులను మద్యం, గంజాయి మత్తులో దింపి.. వారితో అర్ధ నగ్న నృత్యాలు, అశ్లీల, అసాంఘిక కార్యక్రమాలను నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ముజ్రా పార్టీ శిబిరంపై దాడులు చేసి 70 గ్రాముల గంజాయి, రూ.19వేలు, ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఫామ్ హౌస్ యజమానితో పాటు పార్టీలో పాల్గొన్నవారిని బుధవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు.

- వివరాలు IVలో..

# సర్వర్ డౌన్‌తో అవస్థలు

## మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

వికారాబాద్, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.. ఇందులో భాగంగా ప్రజాపాలన, వార్డు సభల్లో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారుల జాబితాను మున్సిపల్ అధికారులు తయారు చేశారు. అర్హులైనవారి జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు లబ్ధిదారుల నుంచి ఫోన్ నంబర్, ఓటీపీతో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండు రోజుల నుంచి లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయానికి భారీగా తరలివస్తున్నారు. దీంతో సర్వర్ డౌన్ కావడంతో వెనుదిరిగి నిరాశతో వెళ్లిపోతున్నారు. సర్వర్ వస్తేనే లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా సర్వర్ సరిగా వచ్చేలా చేస్తే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మేలు చేసిన వారవుతారని పేర్కొంటున్నారు.



## భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

తుర్కయాంజాల్, ఏప్రిల్ 9 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సర్వే నం. 240, 241, 242లోని సుమారు 10 ఎకరాల భూమి తమకు చెందినదని.. ఈమేరకు కోర్టు అర్డర్ ఉందంటూ పలువురు వ్యక్తులు బుధవారం స్థలాన్ని కబ్జాలోకి తీసుకునేందుకు యత్నించారు. అందులో భాగంగా ప్లాట్ల కడీలు, ప్రీకాస్ట్ గోడలను కూల్చివేస్తున్న సమయంలో కాలనీలో నివాసముంటున్న వారితోపాటు ప్లాట్ల యజమానులు కడీలు, గోడలను కూల్చవద్దంటూ వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు ప్లాట్ల యజమానులు, కాలనీవాసులపై దాడికి పాల్పడడంతో.. కాలనీవాసులు, ప్లాట్ల యజమానులు తిరిగి రాళ్లతో దాడికి దిగి కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులను తరిమికొట్టారు. వివాదం జరిగిన గంటన్నర తర్వాత పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు.

- వివరాలు IVలో..




పరస్పర దాడుల్లో కాలనీవాసులు, ప్లాట్ల యజమానులు, కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తులు




## రాగల 24 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరోవైపు పగటి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 36.9 డిగ్రీలు, కనిష్ఠం 23.4 డిగ్రీలు, గాలిలో తేమ 35 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## నల్లాకు మోటర్ బిగిస్తే రూ.5 వేలు జరిమానా

సిటీ బ్యూరో, ఏప్రిల్ 9, (నమస్తే తెలంగాణ) : నల్లాల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడితే రూ.5వేలు జరిమానా వేసి, కఠిన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో ఓ అండ్ ఎమ్ సీజీఎం, జీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. జలమండలి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నదని, నీటిని వృథా చేయకుండా తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరారు. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని ఆయన పేర్కొన్నారు.




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

# చేజారుతున్న ప్రాజెక్టులు

## హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించినా.. నిర్మాణ బాధ్యతలు ఇతర విభాగాలకు..

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు చేతి నిండా ప్రాజెక్టులు.. గల్లా పెట్టె నిండేలా రెవెన్యూ మార్గాలు. ఇంకేముంది కొత్త ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించడమే ఆలస్యం.. చకచకా ప్రాజెక్టులను పట్టాలెక్కించిన హెచ్ఎండీఏ.. ఇప్పుడు నిధుల్లేక చేతులు ఎత్తివేయాల్సి వస్తున్నది. ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినా.. నిధుల్లేక ఇతర సంస్థలకు మళ్లించాల్సి వస్తున్నది. గ్లోబల్ సిటీ ప్రతిష్టను పెంచే ఎన్నో ప్రాజెక్టులు హెచ్ఎండీఏ చేతుల నుంచి జారిపోతున్నాయి. దీనికి హెచ్ఎండీఏకు నెలవారీగా వచ్చే ఆదాయం లేకపోవడమేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. హైదరాబాద్ నగరాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో హెచ్ఎండీఏ కీలకపాత్ర పోషిస్తున్నది. 11 జిల్లాల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు, మెరుగైన రవాణా సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్‌ల నిర్మాణంలో ముఖ్య భూమికను పోషించే హెచ్ఎండీఏ.. ఇప్పుడు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేజార్చుకుంటున్నది. గతంలో మెరుగైన గృహ సముదాయాలను జనాలకు అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ తరహా లే అవుట్లను అధునాతన పట్టణ ప్రణాళికలతో డెవలప్ చేసింది. అనంతరం నగరంలో ఫైఓవర్లు, ట్రక్ పార్కులు, లాజిస్టిక్ హబ్, ఐటీ కారిడార్లు, ఎకో పార్కులు, అర్బన్ ఫారెస్ట్రీలను అభివృద్ధి చేసిన హెచ్ఎండీఏ.. నిధుల్లేక చేతులెత్తేస్తున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందకపోవడం ఓ వైపు ఉంటే.. రెవెన్యూ మార్గాలు తగ్గిపోవడం ఇప్పుడు ఆ విభాగాన్ని ఖాళీ చేతులతో కూర్చునేలా చేస్తున్నది.

### ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయానికి..

అవుటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డును అనుసంధానం చేసేలా హెచ్ఎండీఏ గ్రీన్ ఫీల్డ్ హైవేను ఫ్యూచర్ సిటీ మీదుగా హెచ్ఎండీఏ-హెచ్‌జీసీఎల్ డిజైన్ చేసింది. అయితే ఈ ప్రాజెక్టు భూసేకరణ, ప్రాజెక్టు నిర్మాణం అంచనా వ్యయం తదితర అంశాలపై సుదీర్ఘంగా ప్రణాళికలు రూపొందించి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయానికి హెచ్ఎండీఏ చేతుల్లోనుంచి జారిపోయింది. అదేవిధంగా నగరంలో లింకు రోడ్లను నిర్మాణంతో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేలా నగర శివారుల్లో 49 లింకు రోడ్ల ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రాజెక్టును హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధులిచ్చిన ప్రభుత్వం.. ఆ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నది. అదేవిధంగా మీరాలం లేక్‌ను సుందరీకరించాలనే లక్ష్యంతో గతంలోనే హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. కానీ ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇదేవిధంగా నగర నడిబొడ్డున ఉన్న హుస్సేన్‌సాగర్ పరిసరాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు హెచ్ఎండీఏ సిద్ధం కాగా.. ఈ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ పనులను కూడా ఇతర సంస్థలకు అప్పగించే యోచనలో ఉన్నట్లుగా తెలిసింది.